క్లుప్తంగా

45 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: ఇంటింటికి వైద్య పరీక్షల్లో భాగంగా శుక్రవారం కొండారెడ్డిపల్లి పంచాయతీ నిర్వహించిన వైద్యశిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంప్‌లో ఏఎన్ఎంలు, ఆశాలు,104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

220 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 220 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెట్లూరు, ఎస్ఎస్ కండ్రిక, జగ్గరాజుపాలెం, వర్ధినేనివారిపాలెం, నరసరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 955 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 735 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 220 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 281, కనిష్ట ధర కేజీ రూ.159, సరాసరి ధర కేజీ రూ.252.60గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు గ్రామంలో ప్రకాశం జిల్లా ఆత్మ పథకం కింద ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శేషారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. ప్రవృతి వ్యవసాయంలో అధిక దిగబడులు సాధించవచ్చని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించినట్లు అవుతుందని చెప్పారు. వివిధ రకాల కషాయాలైన జీవక్రియలను తయారు చేసి రైతులకు చూపించారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌కే.అబ్దుల్ రహీమ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు గీతా ప్రకాష్, రవికుమార్, జి.మధు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఉలవపాడు: గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కేవీపీఎస్ రాష్ట్రకార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి డిమాండ్ చేశారు. శుక్రవారం రామకృష్ణాపురం గ్రామంలో ఐదు రోజులు రిమాండ్‌లో ఉండి బయటకు వచ్చిన మహిళలు లలిత, శిరీష, సుజాతలను ఆయన పరామర్శించి మాట్లాడారు. కరేడు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచడం కోసం ప్రభుత్వ చర్యలలో భాగంగా గిరిజన మహిళలపై కేసులు పెట్టారన్నారు. కుటుంబ సభ్యుల మధ్య జరిగిన గొడవను ఆసరాగా చేసుకుని గిరిజనులపై అక్రమ కేసులు మోపడం సరైనది కాదన్నారు. గిరిజనులకు న్యాయం జరగాలంటే ఎస్సీ, ఎస్టీ జాతీయ కమీషన్ చైర్మన్ రామకృష్ణాపురం సందర్శించాలన్నారు. 30 పోలీస్ యాక్ట్ ఎత్తివేయాలని రైతులు, రైతుకూలీల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెల రమేష్, కొమరగిరి వెంకటేశ్వర్లు అంకమ్మరావు, సుజాత, పద్మ, ఏసురాణి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు



వెలిగండ్ల(కనిగిరిరూరల్): సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు శుక్రవారం మండలంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్‌లు మాట్లాడుతూ పార్టీ ఏర్పడిన తర్వాత తొలిసారి సీపీఐ రాష్ట్ర మహాసభలు ప్రకాశం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 20 నుంచి 25 వరకు మహాసభలు జరుగుతాయన్నారు. 30 వేల మందితో భారీ ప్రదర్శన, 100 డప్పులు, వెయ్యి గొంతులతో ఒంగోలు పురవీధుల్లో నృత్య ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. మహాసభల విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జీపీ రామారావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, గుజ్జుల బాలిరెడ్డి, గులాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ర కొట్టు.. డబ్బు పట్టు!

- 240 ఎకరాల కొత్తచెరువును చెరబడుతున్న టీడీపీ నేతలు
- అన్నపురెడ్డిపల్లి, కోడూరివారిపల్లి, కొత్తపల్లి గ్రామాల చెరువులో కర్ర నరికివేత
- వత్తాసు పలుకుతున్న అధికారులు

పీసీపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే మొదలు పర్యావరణాన్ని నాశనం చేసింది. పంచభూతాలను సైతం చెరబట్టి అందినకాడికి దోచుకుతింటున్నారు. అధికార పార్టీ ఆగడాలు అన్ని ఇన్ని కావు.. అంతా మా ఇష్టం అన్నట్లుగా సాగుతోంది. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారు. మండల పరిధిలోని అన్నపరెడ్డిపల్లి, కోడూరివారిపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన 240 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉన్నాయి. ఈ చెరువులో చిల్లకర్ర దట్టంగా పెరిగి ఉంది. ఇదే టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తోంది. ఆ గ్రామాలకు చెందిన కొంతమంది టీడీపీ నాయకులు గత పది రోజులుగా కర్ర కొట్టుకొని లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. సుమారు 20 ఏళ్ల నుంచి ఆ చెరువులో ఎటువంటి కర్ర కొట్టలేదు. నల్ల తుమ్మ, తెల్ల తుమ్మ, నేరేడు, జామ చెట్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు కోటి రూపాయలు దాకా ఉంటుంది. అయితే చెరువులో నీరు లేక పోవడంతో పశుకాపరులు జీవాలను మేపుకుంటున్నారు. మూగజీవాలకు ఈ చెరువే ఆధారం. రోజూ ఇలా పచ్చని కర్ర సంపద తరలిపోతుంటే మూగజీవాలకు మేత దొరకడం కష్టంగా ఉంటుందని పశుకాపరులు వాపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. మీ దిక్కున్న చోట చెప్పుకోండని సమాధానం చెప్తున్నారని పశుకాపరులు అంటున్నారు. ఇలా కొట్టిన కర్రను బొగ్గుల తయారీకి, పొగాకు బ్యార్నీలకు అమ్ముకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

మొన్న చింతగంపల్లి, నిన్న పీసీపల్లి, ఈరోజు ఇర్లపాడు ఇలా టీడీపీ నేతలు భూ ఆక్రమణలకు, ప్రభుత్వ సొమ్ము దోచుకునేందుకు అడ్డు ఆపులేకుండా పోతుందని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న కర్ర

దీనికి తోడు ఇరిగేషన్, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతుండటంతో అవినీతికి అంతులేకుండా పోతోంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి కర్ర కొట్టకుండా ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌పై తరలిస్తున్న కర్ర



నల్లతుమ్మ చెట్లను నరికిన దృశ్యం

రేపు ఏపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

సీఎస్‌పురం(పామూరు): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సీఎస్‌పురం మండలశాఖ కౌన్సిల్ సమావేశం రేపు ఆదివారం స్థానిక వడ్డెపాలెం పాఠశాలలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు తెలిపారు. స్థానిక వడ్డెపాలెం పాఠశాలలో శుక్రవారం ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ మండలశాఖ ఎన్నికలు జరుగుతాయన్నారు. విద్యారంగంలో జరుగుతున్న మార్పులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. సమావేశానికి మండలంలోని ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, జి.రామకృష్ణ, సీహెచ్.చంద్రశేఖర్, బత్తుల రవీంద్ర, నన్నసాని గాంధీ, దండే శ్రీనివాసులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్

తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెంపు

కొండపి: తల్లిపాలు బిడ్డకు వరం అని సీడీపీఓ సుశీల దేవి అన్నారు. శుక్రవారం తల్లి పిల్లల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుశీల దేవి మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ప్రతి ఏటా తల్లి పిల్లల వారోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కార్యక్రమాన్ని నేతువారిపాలెంలో గ్రామంలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. తల్లిపాలను పుట్టిన బిడ్డకు తాగిస్తే పిల్లలు పౌష్టికంగా ఉంటారన్నారు. పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు పట్టాలని అందుకు కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, హెల్త్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ దేపూరి లక్ష్మీప్రసన్న, అంగన్వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.



నేతివారిపాలెంలో ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ సుశీలదేవి, సిబ్బంది

సంతకం కావాలంటే డబ్బు కొట్టాల్సిందే



రీ సర్వే అధికారి రూమ్ నుంచి స్కూటీకి చార్జింగ్ పెట్టిన కార్యాలయ సిబ్బంది

- సొంత పనులకు అడ్డాగా తహసీల్దార్ కార్యాలయం
- విస్తుపోతున్న ప్రజలు, అర్జీదారులు

కొండపి: తహసీల్దార్ కార్యాలయంలో ఏదైనా సంతకం కావాల్సి ఉంటే డబ్బులు కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆధార్ కార్డులో చిరునామా మార్పు కోసం గెజిటెడ్ సంతకం కావాలి. గెజిటెడ్ సంతకం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే మధ్యవర్తులు తహసీల్దార్ గెజిటెడ్ సంతకం కోసం రూ. 500 వసూలు చేస్తున్నారని, అదేవిధంగా ఆన్‌లైన్‌లో పేరు ఎక్కించడానికి రూ.1000 నుంచి రూ.3000 వరకు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మధ్యవర్తికి డబ్బులు కట్టకపోతే సంతకాలు కావడంలేదని ఆన్‌లైన్ పేరుకు ప్రాసెస్ ప్రారంభం కావడం లేదని వాపోతున్నారు. ఏదైనా పనికి తహసీల్దార్ కార్యాలయానికి వెళితే డబ్బులు చెల్లించిన వారికి ముందుగా పని అవుతుందని, చెల్లించని వారికి రేపు ఎల్లుండి అనే విధంగా తిప్పుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ స్పందించి లంచాలు తీసుకొని పనులు చేస్తున్న సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నీ పనులు కార్యాలయంలోనే..

సొంత పనులకు అడ్డాగా కొండపి తహసీల్దార్ కార్యాలయం నిలుస్తుందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రీ సర్వే సిబ్బంది రూమ్‌లో నుంచి సిబ్బందికి సంబంధించిన ఎలక్ట్రికల్ స్కూటీకి చార్జింగ్ పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించిన పనులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ కార్యాలయాన్ని వ్యక్తిగత పనులకు ఉపయోగించుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్యాలయానికి సంబంధించిన కరెంట్‌తో స్కూటీకి చార్జింగ్ పెట్టుకుంటున్న సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి



క్యూఆర్‌కోడ్ పత్రం అందజేస్తున్న ఇన్‌చార్జ్, నాయకులు



మోపాడులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పత్రాలను ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జ్, నాయకులు

- మోసపూరిత హామీలపై క్షేత్రస్థాయిలో ఎండగట్టాలి
- ప్రజలను వంచనచేసిన కూటమికి భంగపాటు తప్పదు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల ధ్వజం

పామూరు: అబద్ధపు హామీలతోనే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గద్దెనెక్కిందని.. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమికి భంగపాటు తప్పదని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని మోపాడు గ్రామంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మ్యానిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దద్దాల మాట్లాడుతూ ఎన్నికలవేళ ప్రజలకు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టో అమలును గద్దెనెక్కిన తరువాత కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. 13 నెలల పాలనలోనే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, దీంతో కూటమి ప్రజాప్రతినిధులు పోలీసుల పహారాలోనే గ్రామాల్లో పర్యటనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఇది సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను నేడు రాష్ట్రంలోని ప్రజలందరికి తెలియజేసేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రచార పత్రాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అద్దపు హామీలు మొత్తం కనిపిస్తాయని, వీటన్నిటిపై కూటమి నేతలను ప్రజలందరు ప్రశ్నించాలన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి..

ఏ ఎన్నికలు వచ్చినా ముఖ్యమంత్రిగా జగనన్న లక్ష్యంతోనే పనిచేయాలని, జగనన్న సీఎంగా ఉంటేనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలుచేసి సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన అబద్ధపు హామీల క్యూఆర్‌కోడ్ పత్రాలను ప్రజలకు అందజేసి వారికి మోసాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ దద్దాల, పార్టీ నాయకులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్‌చాంద్‌బాషా, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, శ్రీరాం శ్రీను, కటికాల వెంకటరత్నం, జె.గోవిందయ్య, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, గాయకవాడ సుభాషిణి, పద్మ, పందిటి లక్ష్మి, పాలేటి ప్రేమ్‌కుమార్, ఆవుల బాస్కర్‌రెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, జక్కు శ్రీనివాసులురెడ్డి, అంబవరపు మోహన్‌రెడ్డి, దండు రామకృష్ణ, కోడూరి రామసుబ్బారెడ్డి, జి.నారాయణరెడ్డి, కే.హజరత్, కోటా సుధాకర్, బోయల శ్రీను, మహేష్, మహేంద్ర, పాలకొండు నాగేశ్వరరావు, గానుగపెంట రామకృష్ణ, గాజులపల్లి బాబు, పోలు మోహన్‌రెడ్డి, కే.తిరుపతి, గాజులపల్లి జయరామిరెడ్డి, దండు చినతిరుపతి, కల్లూరి జగన్‌మోహన్‌రెడ్డి, చింతం బాలిరెడ్డి, మితికాల బాలక్రిష్ణ, దండు రఘురామిరెడ్డి, మూల కోటిరెడ్డి, పెన్నా మల్లేశ్వరి, గానుగపెంట సుజాత, కల్లూరి నాగేశ్వరి, జయరామిరెడ్డి, వాకమళ్ల మహేశ్వరరెడ్డి, జిల్లెళ్ల తిరుపతిరెడ్డి, కోటా దశరధరామిరెడ్డి, పేరం నాగేంద్ర, సంగు రమణారెడ్డి, గునుపాటి సుబ్బరామిరెడ్డి, ద్రోణాదుల మాలి, షేక్.నాయబ్, నీరుకట్టు శ్రీనివాసులు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులను సన్మానిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న జాలా అంజయ్య

సీఎస్‌పురం(పామూరు): కార్మికులు ఐక్యమత్యంతో కలిసి పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని.. కార్మికుల హక్కులను కాపాడగలమని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సీనియర్ నాయకుడు జాలా అంజయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ శుక్రవారం స్థానిక కార్యాలయంలో గుర్రం లక్ష్మయ్య అధ్యతన జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం జెండాను అంకయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదలు, కూలీల సంక్షేమాన్ని గాలికి వదలి పెట్టుబడిదారులు, బడా పారిశ్రామిక వేత్తల సంపద పెరిగేందుకే దోహదపడుతున్నారన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని కార్మికుల సంక్షేమంకోసం పనిచేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు సరికావన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఊసా వెంకటేశ్వర్లు, కొమ్మలపాటి మాల్యాద్రి, బడుగు వెంకటేశ్వర్లు, ఎస్.తిరుపతిరెడ్డి, ఊసా రాజ్యలక్ష్మి, రత్నారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన అవసరం

కనిగిరిరూరల్: ఊపిరి తిత్తుల క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ పి కృష్ణ మోహన్‌రెడ్డిలు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వివిధ సంస్థల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఊపిరి తిత్తుల క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తుల వాడకంకు దూరంగా ఉండాలన్నారు. పనులు పూర్తి అయిన వెంటనే ఇంటికి వెళ్లి చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. మంచి ఆహారం, వ్యాయామంలాంటి అలవాట్లు, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, శానటరీ ఇన్స్‌పెక్టర్ నాయబ్ రసూల్, రమేష్ బాబు, నవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ గఫార్, పక్కన కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

ఉలవపాడు: ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల శాతం పెంచాలని నెల్లూరు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలియచేశారు. మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలను మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

రోజురోజుకీ తగ్గుతున్న సరాసరి ధరలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొగాకు రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేలం ప్రక్రియలో పాల్గొని పొగాకు బేళ్లను తిరస్కరించిన పొగాకు కంపెనీ బయ్యర్లు సాయంత్రం అక్రమంగా పొగాకు బేళ్లను కొనుగోలు చేసి పక్క కంపెనీలకు తరలించి కాసులు కూడబెట్టుకుంటున్నారు. పొగాకు బోర్డు అధికారులకు, విజిలెన్సు అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొగాకు బోర్డు అధికారులు మాత్రం వేలం కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలు పట్టించుకోవడం లేదు. ప్రతి రోజూ పెద్ద ఎత్తున పొగాకు బేళ్ల తిరస్కరణకు గురవుతున్నాయని రైతులు పలు రకాలుగా ఆందోళన చేస్తున్నా బోర్డు అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదు. రోజురోజుకీ తగ్గుతున్న పొగాకు సరాసరి ధరలు, తిరస్కరణ బేళ్లు చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి రూ. 200. 21గా నమోదైంది. వేలం కేంద్రానికి కారుమంచి, ఎం. నిడమానూరు గ్రామాలకి చెందిన రైతులు వేలానికి 901 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 530 కొనుగోలు జరగగా, 371 పొగాకు బేళ్లు తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 281 కాగా, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 220. 21 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పాఠశాలలో ఆర్వోప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హనుమంతునిపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందనవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్వోప్లాంట్ ప్రారంభించారు. కోరమాండ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ విజయవాడ సౌజన్యంతో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆ కంపెనీ వైస్ చైర్మన్ గంటా సుబ్బారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరిసింహారెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. అదే విధంగా దాత గ్రామ మాజీ సర్పంచ్ వైఎస్సార్ పార్టీ నాయకులు ఆకు మల్ల నాగబ్రహ్మాచారి తండ్రి గాలెయ్య జ్ఞాపకార్థం పాఠశాలలో రూ 1.60 లక్షలతో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కంపెనీ రాష్ట్ర రీజనల్ మేనేజర్ కెఎస్ఆర్ చక్రవర్తి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

కనిగిరిరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నూతన పెన్షన్లు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. ఏడాది కాలంగా దివ్యాంగులు సర్టిఫికెట్లు పొంది పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినుంచి ఇప్పటికీ కొత్త పింఛన్ ఇవ్వక పోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.